సాక్షి
ఖమ్మం
బుధవారం ; 31 ; మే ; 2023



ఏడాదిలోపే ఎండపెట్టేశారు!
రఘునాథపాలెంలో ఏడాది క్రితం ప్రారంభించిన పార్క్ నిర్వహణ లోపాలతో కళావిహీనంగా మారింది. 8లో



సీఎం కప్ పోటీల్లో ప్రతిభ
హైదరాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు వివిధ విభాగాల్లో సత్తా చాటుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 27°
వాతావరణం
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగానే నమోదవుతాయి. వేడి, వడగాలుల ప్రభావం కూడా తగ్గుతుంది.

సాగు..బాగుండేలా!


కొనుగోలు చేసిన మిర్చితో రైతులు, సంస్థ ప్రతినిధులు


నాణ్యత ఆధారంగా మిర్చి ధర నిర్ధారిస్తున్న వ్యాపారులు

ప్రత్యేక ప్రాజెక్టును అమలుచేస్తున్న ప్రభుత్వం
- పైలట్‌గా కూసుమంచి వ్యవసాయ డివిజన్ ఎంపిక
- ప్రత్యేక సూచనలతో ప్రయోజనం పొందిన మిర్చి రైతులు
- ఈ ఏడాది జిల్లా అంతటా అమలుకు నిర్ణయం



మిర్చి నాణ్యతను పరీక్షిస్తున్న సిబ్బంది


యాప్ ద్వారా రైతులకు మెళకువలు వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖమ్మం డెస్క్: సంప్రదాయ విధానాల్లో పంటల సాగుతో రైతులకు నష్టమే జరుగుతోంది. రసాయనిక మందులను ఇష్టారాజ్యంగా వాడుతుండడంతో కొత్త తెగుళ్ల పంటలను ఆశిస్తుండగా నివారణ చర్యలపై అవగాహన లేక దిగుబడి పడిపోతోంది. ఈనేపథ్యాన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు 'సాగు - బాగు' పేరిట ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో స్టార్టప్ కంపెనీలు, కేంద్రీకృత సంస్థలను భాగస్వామ్యం చేయడంతో సంస్థల ప్రతినిధులు రైతులకు సాగు మొదలు అమ్మకం వరకు ఎక్కడా నష్టం జరగకుండా సాంకేతిక సాయంతో అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది జిల్లాలోని కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాలతో కూడిన కూసుమంచి వ్యవసాయ డివిజన్‌లో మిర్చి పంటను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా.. రానున్న ఖరీఫ్‌లో జిల్లా అంతటా అమలుచేయాలని నిర్ణయించారు.

'డిజిటల్ గ్రీన్ సంస్థ' ద్వారా..
సాగు - బాగు ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో కమిషనర్‌గా వ్యవసాయ అడిషనల్ కమిషనర్ హనుమంతు కొడింబా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో కూసుమంచి వ్యవసాయ డివిజన్‌ను ఎంపిక చేయగా, డిజిటల్ గ్రీన్ సంస్థ సహకారంతో అమలుచేస్తున్నారు. ఇందుకోసం సదరు సంస్థ ప్రతినిధులు మూడు మండలాల్లో 25మంది సీఆర్పీలతో పాటు వీరిని పర్యవేక్షించేందుకు మండల స్థాయి ఎంఎల్ఈలను నియమించారు. వీరికి సాగు - బాగు ప్రాజెక్టుపై శిక్షణ ఇచ్చి నెలకు రూ.6వేల చొప్పున గౌరవ వేతనం కూడా చెల్లిస్తున్నారు.

ఏమేం చేశారంటే...
పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్న కూసుమంచి వ్యవసాయ డివిజన్‌లో 7వేల మంది మిర్చి రైతులను ఎంపిక చేసి వీరి భూముల్లో 1,050 చోట్ల భూసార పరీక్షలు నిర్వహించారు. అలాగే, రైతులకు సాంకేతిక సలహాలు ఇచ్చేందుకు మహబూబాబాద్ జిల్లా మల్యాలలోని వ్యవసాయ, ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త భాస్కర్‌ను ఎంపిక చేశారు. సంస్థ ప్రతినిధులు మిర్చి రైతులను సమావేశపర్చి ఎరువుల మోతాదు, పైరుకు ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. అంతేకాక క్షేత్రాల నుంచి చాట్‌బాట్ యాప్ ద్వారా పంట స్థితిగతులను శాస్త్రవేత్తకు వివరిస్తూ తీసుకోవాల్సిన మెళకువలను రైతులకు తెలియజేశారు.

ఆ తర్వాత..
మిర్చి చేతికి వస్తుండగా.. నాణ్యతను పరీక్షించేందుకు మూడు మండల కేంద్రాల్లో రైతు వేదికల్లో ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. తద్వారా తెగుళ్లు, పురుగులను గుర్తించడం, తేమశాతం, కాయ పొడవు, గింజల స్థితి, రంగు, ఘాటు గుర్తించడం వీలైంది. అలాగే, కాయలో ఫంగస్, బూజు వంటి వాటిని గుర్తిస్తూ పంటకు ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు కేటాయించారు. అనంతరం కాల్గుడి సంస్థ నుంచి బయ్యర్లను రైతులతో సమావేశపర్చి పంట కొనుగోళ్లకు ప్రోత్సహించారు.

లాభమేమిటి?
సాగు-బాగు ప్రాజెక్టు ద్వారా బయ్యర్లు నేరుగా రైతు సాగు క్షేత్రంలోనే పంటను కొనుగోలు చేశారు. తద్వారా రైతులు పంటను మార్కెట్‌కు, వ్యాపారి వద్దకు తరలించే బాధ తప్పడంతో పాటు రవాణా ఖర్చులు మిగిలాయి. అలాగే, ప్రభుత్వం విధించే మార్కెట్ పన్ను, వ్యాపారులకు ఇవ్వాల్సిన కమీషన్ మిగిలింది. నాణ్యత ఆధారంగా ప్రభుత్వం నిర్దేశించిన లేదా పంటకు ఉన్న డిమాండ్ ఆధారంగా ధర లభించడం, నగదు అయినా ఆన్‌లైన్ చెల్లింపులైనా అదే రోజు జరగడంతో రైతులకు ఎదురుచూపులు తప్పాయి. ఈ ఏడాది మూడు మండలాల్లో 150మెట్రిక్ టన్నుల మిర్చిని డిజిటల్ గ్రీన్ సంస్థ పర్యవేక్షణలో కాల్గుడి సంస్థ బయ్యర్లు క్వింటాకు నాణ్యత ఆధారంగా రూ. 18,500 నుంచి రూ.21,500 ధర చెల్లించి కొనుగోలు చేయడం విశేషం. రానున్న సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా మిర్చి సాగుతో పాటు మహబూ బాబాద్, వరంగల్ జిల్లాల్లోనూ సాగు-బాగు ప్రాజె క్టు అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

21 క్వింటాళ్లు విక్రయించా..

ఈ ప్రాజెక్టు ప్రయోజనకరంగా ఉంది. నేరుగా శాస్త్రవేత్త సలహాలు, సూచనలు ఇచ్చారు. డిజిటల్ గ్రీన్ సంస్థకు 18 క్వింటాళ్ల మిర్చిని పొలంలోనే విక్రయిస్తే క్వింటాకు రూ.18,600 ధర వచ్చింది. కమీషన్, రవాణా చార్జీలు లేకపోగా నగదు కూడా వెంటనే అందింది.
– బానోత్ రవి, లింగారం తండా, కూసుమంచి మండలం

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించాం

వ్యవసాయ, ఉద్యానశాఖల సహకారంతో మిర్చి రైతుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించాం. సాగులో మెళకువలు, ఎరువుల వినియోగం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించగా పెట్టుబడులు తగ్గాయి. జిల్లాలో ఈ ప్రాజెక్టు మంచి ఫలితాలను ఇస్తోంది.
– చంద్రగిరి యశోద, అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్, డిజిటల్ గ్రీన్ ప్రాజెక్టు

రైతు ప్రయోజనాలే లక్ష్యంగా...

సాగు – బాగు ప్రాజెక్టు రైతులకు ఎంతో ప్రయోజనకరం. పంట సాగు మొదలు మార్కెటింగ్ వరకు అన్ని దశల్లో రైతులకు లాభమే తప్ప ఎలాంటి నష్టం ఎదురుకాదు. ప్రస్తుత పంట సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నాం.
– జి.అనసూయ, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి

ధగధగలాడేలా దశాబ్ది ఉత్సవం


మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన ఎంపీ రవిచంద్ర, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, ఎమ్మెల్యే సండ్ర, అదనపు కలెక్టర్ స్నేహలత

- పల్లె నుంచి పట్టణం వరకు వేడుకలు
- అన్నివర్గాల ప్రజలను ఉత్సవాల్లో మమేకం చేయండి
- ప్రతీచోట అమరులకు నివాళి
- సమీక్షలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సీఎం కేసీఆర్ నేతృత్వాన తెలంగాణ సాధించడమే కాక సుపరిపాలన అందిస్తున్నారు.. ఇందులో భాగంగానే ఖమ్మం జిల్లా అన్ని రంగాల్లో దూసుకుపోతోంది.. ఈనేపథ్యాన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లా అంతటా ఘనంగా నిర్వహించాలి.. అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి మంత్రి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అమరవీరుల స్థూపం వద్ద, మిగిలిన ఉద్యోగులు కార్యాలయాల్లో అమరులకు నివాళులర్పించాలని సూచించారు.

పండుగ వాతావరణంలో..
వచ్చే నెల 2నుంచి 22 వరకు 21 రోజులపాటు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో పండుగ వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి తెలిపారు. చెరువు కట్టలపై ఉన్న దేవతలకు పూజలు, ఇతర కార్యక్రమాల్లో గ్రామస్తులందరినీ భాగస్వామ్యం చేయాలని, మిగతా అన్ని చోట్ల కూడా ప్రజలను మమేకం చేస్తూ సంబరాలు ఘనంగా నిర్వహించాలని చెప్పారు. వేడుకల్లో భాగంగానే ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించాలని చెప్పారు. కాగా, జూన్ 2న ఉదయం కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ, పోలీసుల గౌరవ వందనం, సాయంత్రం లకారం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. తొలిరోజు అమరవీరులకు నివాళులర్పించాల్సి ఉన్నందున అమరవీరుల స్థూపాలను అలంకరించాలని, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు లైట్లు ఏర్పాటుచేయాలని మంత్రి పువ్వాడ సూచించారు.


అందరి భాగస్వామ్యంతో ..
ప్రభుత్వ శాఖల అధికారుల ఆధ్వర్యాన అనేక విజయాలు సాధించామని, జిల్లా పునర్విభజన తర్వాత గతంలో పనిచేసిన కలెక్టర్, పోలీస్ కమిషనర్, ప్రస్తుత కలెక్టర్, సీపీ అద్భుతంగా పనిచేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని చెప్పారు. కాగా, కొత్త గ్రామపంచాయతీల భవన నిర్మాణాలకు అవతరణ వేడుకల సందర్భంగా శంకుస్థాపన చేసుకోవాలని, రఘునాథపాలెం మండల కార్యాలయాన్ని కూడా ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే, ప్రతీ మున్సిపాలిటీలో హరితోత్సవం సందర్భంగా 50 వేలకు తగ్గకుండా మొక్కలను నాటాలని మంత్రి తెలిపారు.

రాష్ట్రంలోనే జిల్లా ముందంజ..
రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రగతికి సంబంధించి అనేక అవార్డులు గెలుచుకున్నామని, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాలతోపాటు ఇతర కార్యక్రమాల్లో బహుమతులు దక్కాయని మంత్రి చెప్పారు. సుపరిపాలనలో భాగంగా ఖమ్మంలో ఐటీ హబ్, పోలీస్ కమిషనరేట్, మున్సిపల్ కార్పొరేషన్, కలెక్టరేట్ కార్యాలయాలు నిర్మించుకోగా.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి జరిగిందని పువ్వాడ తెలిపారు.

ఉద్యమ ఘట్టాలను ఏర్పాటు చేయాలి
రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఉద్యమ ఘట్టాలను ప్రజలకు వివరిస్తూ నగరంలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ అణచివేతలో భాగంగా కేసీఆర్‌ను ఖమ్మం ఆస్పత్రికి తీసుకొచ్చిన ఘటనతో పాటు మిలియన్ మార్చ్, వంటావార్పు, ఇతర కార్యక్రమాలతో కూడిన ఫొటోలను ఏర్పాటుచేయాలని తెలిపారు. ఇంకా ఈ సమీక్షలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, అసిస్టెంట్ కలెక్టర్లు రాధికాగుప్తా, మయాంక్‌సింగ్, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అంబరాన్నంటేలా దశాబ్ది వేడుకలు
ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు


ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో దశాబ్ది ఉత్సవాలు అంబరాన్ని అంటేలా పండుగ వాతావరణంలో నిర్వహించాలని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజలందరినీ వేడుకల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. తెలంగాణ ఏర్పడ్డాక హైదరాబాద్‌కు దీటుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన అభివృద్ధిని వివరించాలని తెలిపారు.

తడిసిన మొక్కజొన్నలు


నేలకొండపల్లి : గువ్వలగూడెం వద్ద తడిసిన బస్తాలను వేరు చేస్తున్న రైతులు

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: నేలకొండపల్లి మండలంలో మంగళవారం కురిసిన అకాల వర్షంతో పలువురు రైతుల మొక్కజొన్న బస్తాలు తడిసి ముద్దయ్యాయి. మండలంలోని గువ్వలగూడెం, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, ఆరెగూడెం తదితర గ్రామాల్లో కురిసిన వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలుచోట్ల మొక్కజొన్న, ధాన్యం కాంటాలు వేసినా మిల్లులకు తరలించటంలో జాప్యం జరగడడంతో బస్తాలు తడిసిపోయాయి. ఇక తిరుమలాయపాలెం మండలంలోని రైతులు కూడా అకాల వర్షం భయంతో ముందు జాగ్రత్త పడ్డారు. వాతావరణం మేఘావృతం కావడంతో తెట్టెలపాడు క్రాస్ వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో పంటను రక్షించుకునేందుకు పట్టాల కోసం పరుగులు తీయాల్సి వచ్చింది. ఇకనైనా మొక్కజొన్న కొనుగోళ్లలో వేగం పెంచాలని రైతులు కోరారు.

మహిళా క్రికెట్ టోర్నీ ప్రారంభం

పటేల్ స్టేడియంలో ప్రారంభించిన మంత్రి పువ్వాడ


క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: ఆల్ ఇండియా మహిళా టీ–20 క్రికెట్ పోటీలు జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళవారం రాత్రి మొదలయ్యాయి. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి జట్లు హాజరుకాగా వారం పాటు సాగనున్న మ్యాచ్‌లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించి బౌలింగ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేలా జిల్లా కేంద్రంలో ఫ్లడ్ లైట్లు సహా అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన జట్లకు ఖమ్మం అతిథ్యం ఇస్తుండడం ఆనందంగా ఉందని చెప్పారు. టోర్నీ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఐదుసార్లు మహిళా జాతీయస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించామన్నారు. జిల్లా నుంచి మహిళా క్రికెటర్లు వెలుగులోకి వచ్చేలా ఈ టోర్నీ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ కమర్తపు మురళి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మహిళా క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు ఎం.డీ.మతిన్, ఆల్ ఇండియా టోర్నీ డైరెక్టర్ సందీప్ ఆర్య, ఓలేటి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.10 లక్షల విరాళం
శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కొత్తగూడేనికి చెందిన డి.రవికళ్యాణ్–హారిక రూ.10 లక్షల విరాళం అందజేశారు.

చల్లబడిన వాతావరణం

- అక్కడక్కడా వర్షాలతో ఉక్కపోత నుంచి ఉపశమనం
- 10 డిగ్రీల మేర తగ్గిన ఉష్ణోగ్రతలు


కూసుమంచి : వర్షంలో వెళ్తున్న వాహనదారులు

ఖమ్మం గాంధీచౌక్: జిల్లాలో మంగళవారం వాతావరణం చల్లబడింది. ఇప్పటి వరకు ఎండవేడి, ఉక్కపోత, వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఉపశమనం కలిగింది. మే నెల మొత్తం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లా అంతటా దాదాపు 45 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో పలువురు వడదెబ్బ బారినపడ్డారు. అయితే, మంగళవారం ఉదయం జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసింది. దీంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పువచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘావృతమై ఉండగా వాతావరణం చల్లబడడమే కాక వడగాలుల ప్రభావం లేకపోవడంతో అందరూ సేదతీరారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు..
వర్ష ప్రభావంతో జిల్లాలో 10 నుంచి 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గాయి. మంగళవారం జిల్లాలో అత్యధికంగా మధిరలో 32.9 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే, ఎర్రుపాలెం, పమ్మి, తల్లాడల్లో 32.8 డిగ్రీలు, వైరాలో 32.7, కుర్నవల్లిలో 32.6, సత్తుపల్లిలో 32.4, పెనుబల్లిలో 32, ఏన్కూరులో 32, ఖమ్మంలో 32, ఖమ్మంరూరల్ మండలం పల్లెగూడెంలో 31.7 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదు కావడం, ఎక్కడ కూడా 40 డిగ్రీల వరకు చేరకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మరో మూడు సబ్ డివిజన్లు

- అదనంగా డీఈలు, ఏఈ పోస్టులు కూడా..
- ఆర్అండ్‌బీ శాఖలో పునర్‌వ్యవస్థీకరణ
- 2వ తేదీ నుంచి కార్యకలాపాలు మొదలు


తిరుమలాయపాలెంలో సిద్ధమైన నూతన సబ్ డివిజన్ కార్యాలయం

ఖమ్మంఅర్బన్: ఆర్అండ్‌బీ(రోడ్లు, భవనాల శాఖ) పునర్ వ్యవస్థీకరణలో భాగంగా జిల్లాలో కొత్తగా మూడు సబ్ డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. ఈమేరకు జీఓను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. అన్ని ప్రభుత్వ శాఖలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పరిపాలనపరంగా వెసులుబాటు కోసం ప్రభుత్వం ఆర్అండ్‌బీ శాఖ పునర్ వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టిందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఇరిగేషన్‌లోని వివిధ విభాగాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి జలవనరుల శాఖగా మార్చారు. ఇటీవల పంచాయతీరాజ్ శాఖలో కూడా మార్పులు చేశారు. ఇప్పుడు ఆర్అండ్‌బీ శాఖపై ప్రభుత్వం దృష్టి సారించింది.

మూడు సబ్ డివిజన్లు.. నాలుగు సెక్షన్లు
రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి ప్రభుత్వం పునర్‌వ్యవస్థీకరించింది. ఇందులో భాగంగా జిల్లాలో కొత్తగా మూడు సబ్ డివిజన్ కార్యాలయాలతో పాటు నాలుగు సెక్షన్ కార్యాలయాల ఏర్పాటుకు నిర్ణయించారు. గతంలో జిల్లాలో ఖమ్మం కేంద్రంగా సర్కిల్ కార్యాలయం, ఖమ్మం, సత్తుపల్లిలో డివిజన్ కార్యాలయాలు, ఖమ్మం, వైరా, మధిర, పెనుబల్లి, సత్తుపల్లి సబ్ డివిజన్లు ఉన్నాయి. తాజా నిర్ణయంతో తిరుమలాయపాలెం, పాలేరు, ఖమ్మంలో భవనాల విభాగానికి ప్రత్యేక సబ్ డివిజన్ ఏర్పాటుకానుంది.

కొత్త సబ్ డివిజన్లు ఇలా...
జిల్లాలో రోడ్లు భవనాల శాఖ నూతన సబ్ డివిజన్ కార్యాలయాలను మంజూరు చేస్తు జీఓ విడుదలైంది. పాలేరు సబ్ డివిజన్ పేరుతో నేలకొండపల్లి, కూసుమంచి, ముదిగొండ మండలాలతో కలిపి కొత్త డివిజన్ ఏర్పాటవుతుంది. అలాగే, తిరుమలాయపాలెం మండలం, పిండిప్రోలు, ఎదులాపురంను కలుపుతూ తిరుమలాయపాలెం సబ్ డివిజన్, ఖమ్మంలో భవనాల విభాగానికి ప్రత్యేక సబ్ డివిజన్ ఏర్పాటుచేస్తారు. వీటి పరిధిలో నలుగురు ఏఈలు, ముగ్గురు డీఈలను నియమించనుండగా, ప్రస్తుతం పక్క డివిజన్ల ఉద్యోగులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. నూతన కార్యాలయాల్లో కార్యకలాపాలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నుంచి మొదలుపెట్టాలని నిర్ణయించగా... నూతన కార్యాలయాలను ఏర్పాటుకు ప్రభుత్వ భవనాలు లేనిచోట ఇప్పటికే ప్రైవేట్ భవనాలు అద్దెకు తీసుకున్నారు.

కార్గో సేవలను ఆదరించండి
కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం భానుకిరణ్


కార్గో పాయింట్‌లో మాట్లాడుతున్న భానుకిరణ్

జూలూరుపాడు/చుంచుపల్లి: టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం భానుకిరణ్ సూచించారు. జూలూరుపాడులో కార్గో సెంటర్‌ను మంగళవారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో 43 కౌంటర్ల ద్వారా కార్గో సేవలు అందిస్తున్నామన్నారు. ఆయా కేంద్రాల ద్వారా పార్సిళ్లు, సురక్షితంగా, వేగంగా చేరవేస్తున్నట్లు చెప్పారు. తాజాగా కేజీ లోపు నుంచి పార్సిళ్ల చేరవేతకు ఏఎం టూ పీఎం, పీఎం టూ ఏఎం కార్యక్రమాన్ని ప్రారంభించామని, కేవలం రూ.99కే పార్సిల్ వేగంగా రవాణా చేస్తామన్నారు. తొలుత సీటీఎం భాను కిరణ్ కొత్తగూడెం డిపోలోని కార్గో పాయింట్‌ను తనిఖీ చేశారు. వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల మేనేజర్ వేణుగోపాల్, ఖమ్మం రీజినల్ ఎగ్జిక్యూటివ్ హరివర్మ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల గుండెల్లో 'రైళ్లు'

రైల్వే స్థలాల ఆక్రమణపై డ్రోన్ కెమెరాతో ఫొటోలు, వీడియోలు తీసిన అధికారులు

ఇల్లెందు: ఇల్లెందులోని రైల్వే భూములు కబ్జాకు గురవుతున్నాయి. రైల్వే ట్రాక్ వెంట ఉన్న భూములతో పాటు స్టేషన్ సమీపంలోని భూముల్లో కూడా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీంతో కొందరు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేయగా.. అధికారులు వారం రోజులుగా పరిశీలించారు. రైల్వే లైన్ వెంట, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో కబ్జాకు గురైన భూముల్లో మంగళవారం డ్రోన్ కెమెరాతో ఫొటోలు, వీడియో చిత్రీకరించారు. దీంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. ఇల్లెందుకు ప్యాసింజర్ రైలు రద్దయ్యాక రైల్వే ట్రాక్ వెంట ఉన్న స్థలాలను కొందరు కబ్జా చేసి పక్కా భవనాలు నిర్మించారు. రైల్వే స్టేషన్ కూడా ఎత్తేయడంతో ఆ స్థలంపై కొందరి కన్నుపడింది. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు రైల్వే అధికారులు పరిశీలన చేపట్టారు. డోర్నకల్ రైల్వేస్టేషన్ జూనియర్ ఇంజనీర్ జోకిన్ మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ రైల్వేస్థలాల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలి పారు. గతంలో ఉన్న భూములు, ప్రస్తుతం ఉన్న స్థలాలను మ్యాప్ ఆధారంగా గుర్తించి ఆక్రమణకు గురైనట్లు తేలితే స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.


డ్రోన్ కెమెరాతో సర్వే నిర్వహిస్తున్న రైల్వే అధికారులు

క్లుప్తంగా

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.15 గంటలకు రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామంలో పర్యటించిన అనంతరం 10 గంటలకు మండలంలోని చిమ్మపుడిలో జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొంటారు. ఆతర్వాత మధ్యాహ్నం 12.30 గంటలకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలపై సమీక్షకు హాజరవుతారు.

వైద్య విద్యార్థినికి రూ.2లక్షలు సాయం



శ్రావణికి చెక్కు అందజేస్తున్న కృష్ణమూర్తి

తల్లాడ: మండలంలోని తెలగవరానికి చెందిన వైద్య విద్యార్థిని పైళ్ల శ్రావణికి ఎన్నారై ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సాయం లభించింది. నార్కట్‌పల్లి కామినేని కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న శ్రావణిది మధ్య తరగతి కుటుంబం కావడంతో ఎదురవుతున్న ఇబ్బందులను బీఆర్‌ఎస్ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన తన కుమారుడైన ఎన్నారై జక్కంపూడి రాము ద్వారా రూ.2లక్షలు ఇప్పించగా శ్రావణి, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మధిర: స్థానిక శివాలయం రోడ్డుకు చెందిన ముంగి శ్రీను పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం రాత్రి దగ్ధమైంది. ఈమేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ మంగళవారం ఆయనను పరామర్శించారు. నాయకులు తూమాటి నవీన్‌రెడ్డి, కర్నాటి రామారావు, దారా బాలరాజు, మాగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై కూలిన తాటిచెట్టు..

వైరారూరల్: రోడ్డుపై వెళ్తున్న ఓ ట్రాక్టర్‌పై అకస్మాత్తుగా తాటిచెట్టు పడిన సంఘటన మండలంలోని గొల్లపూడి–గొల్లెనపాడు గ్రామాల మధ్య మంగళవారం చోటు చేసుకుంది.వివరాలిలా ఉన్నాయి. గొల్లెనపాడుకు చెందిన కందుల సత్యం ట్రాక్టర్‌పై గొల్లపూడి నుంచి గొల్లెనపాడు వెళ్తున్నాడు. ఈక్రమంలో మార్గమధ్యలో తాటిచెట్టు కూలి ట్రాక్టర్‌పై పడడంతో వెంటనే డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి బ్రేక్ వేయడంతో ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

కల్లూరు: మండలంలోని పేరువంచ సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా కోదాడ మండలం బండపాలెం తమ్మరకు చెందిన ముగ్గురు యువకులు ఓ శుభకార్యం నిమిత్తం సోమవారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కల్లూరు మండలం పేరువంచ సమీపాన తిరువూరు వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో షేక్ అజిత్, షేక్ సమీర్, షేక్ హమీద్‌కు తీవ్ర గాయాలు కాగా పోలీసులు చేరుకుని కల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వచ్చిన వారి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు.


ఉసిరికాయపల్లి వద్ద...

కారేపల్లి: ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన పంద చంద్రశేఖర్ ద్విచక్రవాహనంపై ఇల్లెందు మీదుగా అత్తగారి ఊరైన కారేపల్లి మండలం మల్లన్నగూడెం గ్రామానికి మంగళవారం రాత్రి వస్తున్నాడు. ఈక్రమంలో ఉసిరికాయలపల్లి ఓసీ సమీపాన మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో ఆయనకు తీవ్ర గాయాలు కాగా ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

తిరుమలాయపాలెం: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని బాలాజీనగర్‌తండా గ్రామపంచాయతీ పరిధి రమణాతండాకు చెందిన బధిరుడైన మేకల వీరన్న(35) సోమవారం సాయంత్రం భార్య నాగమణితో గొడవ పడి గడ్డి మందు తాగాడు. దీంతో ఆయనను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, వీరన్న కుటుంబాన్ని పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు పాప్యానాయక్, మోహన్ తదితరులు పరామర్శించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

ఏడాదిలోపే ఎండపెట్టేశారు!

కళ తప్పిన 'సుడా'పార్కు

- నీటి కోసం అల్లాడుతున్న మొక్కలు
- పర్యవేక్షణ తమ వల్ల కాదని చేతులెత్తేసిన జీపీ
- నిర్వహణ 'సుడా'నే చేపట్టాలని లేఖ
- పూర్వవైభవం తీసుకురావాలని పలువురి వేడుకోలు



బోసిపోయి కనిపిస్తున్న ఫౌంటెన్

ఖమ్మంఅర్బన్: పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యాటక ప్రాంతంగా ఒక మంచి పార్కు ఉంటే ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని భావించి కోట్లాది రూపాయలతో సుడా పార్కును అభివృద్ధి చేశారు. కానీ ఎవరి పట్టింపులేకపోవడంతో ఏడాదిలోపే ఆదరణ కోల్పోయి, గడ్డి పట్టి, మొక్కలు ఎండిపోతూ కళ తప్పింది. 'సుడా'తో పాటు గ్రామపంచాయతీ, ఉపాధి హామీ పథకం నిధులు కూడా ఈ పార్కు కోసం వెచ్చించారు. కానీ నిర్వహణ ఎవరు చేపట్టాలనే మీమాంస ఎదురు కావడంతో ఇప్పుడు ఈ పార్కు కళావిహీనంగా మారింది.

రూ.కోట్ల నిధులు...

మండల కేంద్రమైన రఘునాథపాలెంలో గత ఏడాది క్రితం సుమారు రూ.2కోట్ల నిధులతో ప్రధాన రహదారి పక్కనే ప్రభుత్వం స్థలం, మధ్యలో చెరువుతో సహా మొత్తం 14 ఎకరాలను గుర్తించి పార్కు, చెరువు మినీ ట్యాంక్ బండ్, బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఇందులో 22 వేల వివిధ రకాల మొక్కలు నాటడడంతో పాటు అనేక బొమ్మలు ఏర్పాటు చేశారు. 'సుడా' నిధులు రూ.1.50 కోట్లు, రఘునాథపాలెం పంచాయతీ నుంచి రూ.35లక్షలు, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.3లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ఈ పార్కును గత ఏడాది జూన్‌లో మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ పార్కు మధ్యలో మినీ ట్యాంక్‌బండ్, ఒక వైపు ఓపెన్ జిమ్, పిల్లల పార్కు, మరో వైపు నీడ, పూలు, వివిధ ఔషధ రకాలు మొక్కలు 22 వేలకు పైగా నాటారు. మొక్కల సంరక్షణకు కోసం డ్రిప్ ఇరిగేషన్ సైతం ఏర్పాటు చేశారు. వనం మధ్యలో నెమలి బొమ్మ, చేతిలో నుండే జారిపడే వాటర్ ఫౌంటెన్, పిల్లల పార్కులో ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. పార్కును ప్రారంభించినప్పటి నుంచి గత మార్చి



రఘునాథపాలెంలోని సుడా పార్క్ ముఖద్వారం

వరకు ఉపాధి కూలీల వేతనాలు ద్వారానే నిర్వహణ పనులు చేయించారు. ఆతర్వాత ఉపాధి కూలీలను బంద్ చేయించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కార్మికులను గ్రామంలోని పనులకు వినియోగిస్తుండడంతో పార్కును చూసేవారు కరువయ్యారు.

రెండు నెలలుగా..

నానాటికీ ఎండలు మండుతున్న వేళ పార్కు పర్యవేక్షణను ఎవరూ పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. అలాగే, వాటర్ ఫౌంటెన్‌లో సైతం గడ్డిపట్టి, పచ్చని చెట్లు మాడిపోతున్నాయి. ఉపాధి కూలీలు పనిచేసే అవకాశం లేదని, పంచాయతీ సిబ్బందితో పనులు చేయించడం ఇబ్బందిగా ఉన్నందున 'సుడా' ద్వారానే పర్యవేక్షించాలని పంచాయతీ, మండల పరిషత్ నుంచి ఇటీవల లేఖ రాశారు. కాగా, పార్కును కాపాడాలంటే కనీసం 10 మంది కార్మికులు రోజు వారి పనులు చేస్తే తప్ప సాధ్యం కాదు. ఈమేరకు ఉన్నతాధికారులు స్పందించి కళ తప్పిన పార్కుకు పూర్వవైభవం వచ్చేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మికులు సరిపోట్లే..

పంచాయతీలోని ఎనిమిది మంది కార్మికులు గ్రామంలోని పనులకే సరిపోతున్నారు. వీరితో డ్రెయినేజీలు, వీధులు శుభ్రం చేయించడం, తాగునీటి సరఫరా తదితర పనులు చేయిస్తున్నాం. దీంతో పార్క్‌లో పనులు, నిర్వహణ కోసం సుడా నుంచి సిబ్బందిని సమకూర్చాలని ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– గుడిపూడి శారదరామారావు, సర్పంచ్

వారంలోగా కొత్తదనం తీసుకొస్తాం..

సుడా పార్కులో పనులు చేయడంతో పాటు పర్యవేక్షణకు సుమారు 10 మంది కార్మికులు అవసరం. ఇప్పటికే గ్రామపంచాయతీ నుంచి అందిన లేఖల ప్రకారం.. సుడా ద్వారా ఒక ఏజెన్సీతో కార్మికులు, ఇద్దరు వాచ్‌మెన్‌లు, రోజు వారి పనులకు మరికొంత మందిని తీసుకోబోతున్నాం. మరో వారంలోగా పార్కుకు కొత్తదనం తీసుకొస్తాం.

– బచ్చు విజయ్‌కుమార్, సుడా చైర్మన్





పార్కు ఆవరణలోని పలు ప్రాంతాల్లో పచ్చని గడ్డి ఎండిపోయి, చెత్తాచెదారం పేరుకుపోయిన దృశ్యాలు

సీఎం కప్ పోటీల్లో జిల్లా అథ్లెట్ల ప్రతిభ



పతకాలు సాధించిన అథ్లెట్లతో కోచ్ గౌస్



ఆర్చరీలో పతకాలు సాధించిన నగేష్, శివసాయి

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడాపోటీల్లో జిల్లా అథ్లెట్ల హవా కొనసాగుతోంది. ఇప్పటి వరకు మహిళల 400 మీటర్ల పరుగులో ఎ.మైథిలి స్వర్ణపతకం గెలుచుకోగా, 100 మీటర్ల పరుగులో ఎస్.కే.లాల్‌పాషా, షాట్‌పుట్‌లో మజీద్, హజీరా ఫాతిమాకు రజత పతకాలు, లాంగ్‌జంప్‌లో ఎస్.కే.ఆఫ్రీన్‌కు కాంస్య పతకం లభించింది.

ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్‌లో..

సీఎం కప్ పోటీల్లో భాగంగా ఆర్చరీ విభాగంలో ఖమ్మంకు చెందిన నగేష్, శివసాయికి స్వర్ణపతకం లభించింది. ఇండియాన్ రౌండ్ 30 మీటర్ల అంశంలో నగేష్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన శివసాయి కాంపౌండ్ రౌండ్‌లో అత్యధిక పాయింట్లు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు. ఇక ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా మహిళల జట్టు కామారెడ్డిపై విజయం సాధించి ఫైనల్స్ చేరింది. అలాగే, వెయిట్ లిఫ్టింగ్ 49 కేజీల విభాగంలో శ్రీసాయి ప్రథమస్థానంతో బంగారు పతకం, 61 కేజీల్లో వి.హరీశ్ రజత పతకం, 55 కేజీ విభాగంలో అభిరాం కాంస్యపతకం దక్కించుకున్నారు. క్రీడాకారులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్‌లు, అసోసియేషన్ల బాధ్యులు ఎం.డీ.గౌస్, మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్, ఎం.సుధాకర్, సాదుల సారంగపాణి, పుట్టా శంకరయ్య, సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్ అభినందించారు.

చీమలపాడు బాధితులకు ఆర్థికసాయం



రూ.50 వేల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

ఖమ్మం వైద్యవిభాగం: కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సిలిండర్ పేలిన ఘటనలో బాధితులకు సీఎం కేసీఆర్, ఎంపీ నామానాగేశ్వరరావు అండగా నిలిచారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న అంగోత్ రవికుమార్(వెంకట్యా తండా), తేజావత్ భాస్కర్(తవిశబోడు), నవీన్‌కుమార్(కానిస్టేబుల్, కారేపల్లి)కి ఎమ్మెల్యే ప్రకటించిన రూ.50వేల చొప్పున సాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రాములునాయక్, నల్లమల మాట్లాడుతూ.. ఇప్పటికే బాధితులకు ప్రభుత్వం తరఫునే కాక మృతి చెందిన వారికి ఎంపీ సొంతంగా రూ.2 లక్షలు చొప్పున అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకమేడల సత్యనారాయణ, చిత్తారు సింహాద్రియాదవ్, మాలోత్ కిషోర్, బానోత్ కుమార్, బత్తుల శ్రీనివాసరావు, డేగల ఉపేందర్, ఎరబెల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నగదు చెల్లించాలని ఆందోళన

తల్లాడ: వరి ధాన్యం విక్రయించి 30 నుంచి 40 రోజులు దాటినా నగదు చెల్లించకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఖమ్మం జిల్లా తల్లాడలో మంగళవారం రైతులు సొసైటీ కార్యాలయం నుంచి సీఈఓ నాగబాబు, సిబ్బందిని బయటకు పంపించి ధర్నా చేశారు. ధాన్యం డబ్బులు చెల్లించాకే జీలుగు, పిల్లి పెసర విత్తనాలు పంపిణీ చేయాలని, డబ్బు లేకపోవడంతో పచ్చిరొట్ట విత్తనాలు ఎలా కొనాలని ప్రశ్నించారు. దీంతో పోలీసులు చేరుకుని ఖమ్మం డీఎస్‌ఓతో ఫోన్‌లో మాట్లాడగా.. రెండు రోజుల్లో ధాన్యం డబ్బులు జమ అవుతాయని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాపా సుదాకర్, దుండేటి వీరారెడ్డి, దగ్గుల రఘుపతిరెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, కటికి కిరణ్, ఎర్రి కృష్టారావు తదితరులు పాల్గొన్నారు.



తల్లాడ సొసైటీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కార్యాలయం మారింది.. బోర్డు మారలేదు..

ఖమ్మంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని కొత్త కలెక్టరేట్‌కు తరలించగా.. ఖాళీ అయిన ఆ భవనాన్ని ఆర్‌అండ్‌బీ శాఖకు కేటాయించారు. ఆర్‌అండ్‌బీ శాఖ నెల రోజులుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నా.. కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ఎస్‌ఈ, ఈఈ చాంబర్‌ల వద్ద బోర్డులు లేకపోగా.. ఆవరణలో కూడా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ అధికారుల పేర్లతోనే బోర్డు కనిపిస్తోంది. దీంతో ఆర్‌అండ్‌బీకి పనుల నిమిత్తం వచ్చే వారు ఒకింత తికమక పడుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

వైద్య సిబ్బందికి కేంద్ర బృందం సూచన

ములకలపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కేంద్ర బృందం సభ్యులు సూచించారు. మంగళవారం వారు ములకలపల్లి మండలం మంగపేట పీహెచ్‌సీని సందర్శించారు. ల్యాబ్, డెలివరీ గదిని, రూ.1.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆస్పత్రి నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రి నిర్వహణ, పెషెంట్ల వివరాలు, ప్రసవాల సంఖ్య తదితర రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని పీఆర్ ఏఈ శివలాల్‌ను ఆదేశించారు. అనంతరం వెద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి బాలింతలకు అందిస్తున్న కేసీఆర్ కిట్ల వివరాలు, ప్రభుత్వ ఆస్పత్రిల్లో ప్రసవాలు పెరిగేందుకు తీసుకుంటున్న చర్యలను స్థానిక వైద్యాధికారి సాయికల్యాణ్‌తో చర్చించారు. విధుల్లో అలసత్వం వహించవద్దని సూచించారు. గర్భిణులకు షెడ్యూల్ మేరకు మందులు అందించాలని, మెరుగైన వైద్య సేవలకు కృషి చేయాలని చెప్పారు. అనంతరం ములకలపల్లి, మూకమామిడి గ్రామాల్లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను (పల్లె దవాఖాన)లను సందర్శించారు. కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ ఆనంద్‌కుమార్, డాక్టర్ హైఫియా, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి మణికంఠ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత పాల్గొన్నారు.



పీహెచ్‌సీ వద్ద కేంద్ర బృందం సభ్యులు, స్థానిక సిబ్బంది

జిల్లాకు ఐదుగురు ఉపాధ్యాయులు

ఖమ్మంసహకారనగర్: లోకల్ కేడర్ ఆధారంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఐదు గురు ఉపాధ్యాయులను ఖమ్మం జిల్లాకు కేటా యించారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉపాధ్యాయులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో వెంటనే విధుల్లో చేరాలని సూచించారు.

గిరిజన విద్యాలయాల్లో ఘనంగా ఉత్సవాలు

భద్రాచలం: తెలంగాణ పదో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం మంగళవారం ఆయన ఆశ్రమపాఠశాల హెచ్‌ఎంలు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఉత్సవాలపై సమీక్షించారు. జూన్ 3 నుంచి బడిబాట, 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యాన ఉత్సవాల నిర్వహణకు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. అలాగే, విద్యార్థులకు టెక్స్ట్, నోట్ బుక్స్, ఇతర మెటీరియల్ పంపిణీపై దృష్టి సారించాలని, పాఠశాలల్లో మైనర్ రిపేర్లపై ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పారు. పాఠశాలల పర్యవేక్షణకు ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించిందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు తానాజీ, రమణయ్య, నర్సింగరావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్

పోడు రైతుల వివరాలు సేకరణ

జూలూరుపాడు: పోడు భూమి సాగు చేసుకుంటున్న రైతులకు జూన్ 24 నుంచి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, రైతుబంధు కూడా అమలు చేస్తామని వెల్లడించింది. ఈ నేపథ్యాన అధికారులు పోడు రైతుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. జూలూరుపాడు మండలం నల్లబండబోడు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం పోడు రైతుల నుంచి రైతుబంధుకు అవసరమైన బ్యాంకు అకౌంట్, ఆధార్ జిరాక్స్‌ను సేకరించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ముక్తి నర్సింహారావు, కార్యదర్శి సెక్రటరీ జ్యోతి పాల్గొన్నారు.



జిరాక్స్ ప్రతులు అందజేస్తున్న పోడు రైతులు

సినీ తరహాలో గంజాయి రవాణా



నిందితులు, గంజాయితో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఇల్లెందురూరల్: కొన్ని సినిమాల్లో చూపినట్లుగా గంజాయిని కొందరు తరలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో ఖమ్మం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇల్లెందు ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం నుంచి వస్తున్న కారు ను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కారులో ఎలాంటి మాదకద్రవ్యా లు లభించకపోవడంతో వదిలేసేందుకు నిర్ణయించారు. ఇంతలోనే ఓ సినిమాలో చూపినట్లు స్టెప్నీ టైర్‌లో రవాణా చేస్తున్నారేమోనని అను మానించి కారు కింది భాగంలో ఉన్న స్టెప్నీ టైరును పరిశీలించారు. అందులో 25 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి ఆశ్చర్యపోయారు. వెంటనే గంజాయిని, కారును స్వాధీనం చేసు కుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వాహన తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వై.సురేశ్, ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ ముబ్‌షీర్, ఇల్లెందు ఎక్సైజ్ ఎస్‌ఐ గోవర్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంలో 13 కేజీలు..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని గోదావరి కరకట్ట వద్ద గంజాయిని విక్రయిస్తున్న, కొనేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులను టాస్క్ ఫోర్స్, భద్రాచలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,60,000 విలువైన 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం గోదావరి కరకట్ట వద్ద టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ, ఎస్‌ఐలు తిరుపతి, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మల్కన్‌గిరి జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్, మంగళ కలిసి ఆంధ్ర – ఒడిశా సరిహద్దులోని సీలేరులో 13 కేజీల గంజాయిని కొనుగోలు చేసి.. హైదరాబాద్‌కు చెందిన దంపతులు అర్జున్‌సింగ్, నందినికి విక్రయిస్తున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేలోగానే ఒకరు పరారు కాగా, మిగిలిన ముగ్గురితోపాటు గంజాయి విక్రయించేందుకు సహకరించిన మరో వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టణ సీఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టాస్క్‌ఫోర్సు అధికారులు, భద్రాచలం పోలీసులను ఏఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.